సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 9 । జూన్ । 2023



వనరులు వినియోగించుకోండి
వనరులను ఉపయోగించుకుని సత్ఫలితాలు సాధించాలని పోర్టు చైర్మన్ అంగముత్తు ఐఎంయూ విద్యార్థులకు సూచించారు. 8లో



సహకార సంఘాల వృద్ధికి కృషి
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని డీసీసీబీ చైర్‌పర్సన్ అనిత అన్నారు. 8లో



'రైలు' మృతులకు నివాళి
ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద మృతులకు వాల్తేర్ డివిజన్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. 8లో

ఉప్పొంగే ఆనందమే

- సీఎం జగన్, వైఎస్సార్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం
- సర్వీసు క్రమబద్ధీకరణపై హర్షం
- రుణపడి ఉంటామన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు



సీఎం జగన్, వైఎస్సార్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమ జీవితాల్లో వెలుగులు నింపారని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉప్పొంగిపోయారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. విశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులు గురువారం దివంగత నేత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీతో కలెక్టరేట్ ప్రాంతంలో కృతజ్ఞతాపూర్వకంగా ఏపీఎన్జీవో ప్రతినిధులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్ వద్ద క్షీరాభిషేకం చేసి, థ్యాంక్యూ సీఎం జగన్ సర్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. మాట ఇస్తే తప్పరు.. మళ్లీ మళ్లీ మీరే మా సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస గుర్తింపు లేకుండా చేస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా తమ సర్వీసును రెగ్యులర్ చేసి చేశారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని ముక్తకంఠంతో నినాదించారు.

ఉద్యోగ పక్షపాతి సీఎం జగన్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ పక్షపాతిగా నిలిచారని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు దశాబ్దాల నుంచి వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడం శుభపరిణామన్నారు. గతంలో ఇలాంటి వేతన సంఘాల ఏర్పాటు కోసం ఆందోళనలు చేశామని, ఎప్పుడు ఎన్జీవోల కోరిక మేరకు ప్రభుత్వం కమిటీని నియమించిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.చలం మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిశంకర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అంతా ఫ్రెండ్లీ ప్రభుత్వమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో విశాఖ నగర అధ్యక్షుడు నారాయణరావుతోపాటు, కాంట్రాక్ట్ ఉద్యోగులు సింహాచలం, లంక శ్రీనివాసరావు, రాజేష్, రమణ, రెడ్డి, గెడ్డం మురళీ, ఆడవి శ్రీను, జగదీష్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సర్

మహారాణిపేట: కేజీహెచ్, ఇతర ఆస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సంఘం నాయకులు గురువారం ఎన్జీవో హోమ్‌లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్వీసులు క్రమబద్ధీకరించి తమ బతుకుల్లో వెలుగులు నింపిన సీఎం జగన్ సర్‌కు థ్యాంక్యూ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ ఈశ్వరరావు, ఇతర నాయకులు ప్రసాద్, నీలిమ, నాగూర్, శ్రీదేవి, ఉన్నీషా, అమర్, రామేశ్వరి, లక్ష్మణ్, ఫార్మసిస్టు మాధవ్, జయకుమార్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్టులు

రాష్ట్రంలో రహదారులకు కొత్త శోభ


శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- రూ.11.84 కోట్లతో పెందుర్తి – అనకాపల్లి బైపాస్ రోడ్డుకు మరమ్మతులు
- పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అమర్‌నాథ్

సింహాచలం : రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన రహదారులకు కొత్త శోభ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సుమారు రూ.11.84 కోట్లతో చేపడుతున్న పెందుర్తి – సబ్బవరం – అనకాపల్లి బైపాస్ రోడ్డు మరమ్మతులు, అభివృద్ధి పనులకు గురువారం పెందుర్తిలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. అనంతరం అమర్ మీడియాతో మాట్లాడారు. గతంలో ప్రధాన రహదారిగా ఉన్న అనకాపల్లిలోని జలగల మదుం జంక్షన్ నుంచి శంకరం వరకు, అనకపల్లి నుంచి సబ్బవరం వరకు, పెందుర్తిలోని రాంపురం జంక్షన్ నుంచి అక్కిరెడ్డిపాలెం వరకు రూ.11.84 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రోడ్లకి కొత్త రూపు తీసుకొస్తున్నామన్నారు. దాదాపు మూడు నెలల కాలంలో పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాలు, ప్రధాన రహదారుల నిర్మాణాలు, కొత్త రహదారుల ఏర్పాటు పెద్ద ఎత్తున చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి విశాఖపట్నం నుంచి భోగాపురం వరకు రూ.6,500 కోట్లతో ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి సంకల్పించారన్నారు. ఇందులో రూ.1,200 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉంటుందన్నారు. నాలుగు నెలల్లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, ఎంపీపీ నాగమణి, వైఎస్సార్ సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అజయ్ రాజ్, పార్టీ సీనియర్ నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, 96వ వార్డు నాయకులు దాడి రమణ చిట్టి, 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, 93వ వార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, నాయకులు గొర్లె రాము నాయుడు, జోబ్ దాస్, సత్తిబాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్‌లో రైలు లోకో పునఃప్రారంభం


లోకోను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మరమ్మతులకు గురైన రైలు లోకోను గురువారం పునఃప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగానికి చెందిన రైలు లోకో కొంత కాలం క్రితం పాడైంది. వాస్తవానికి దాన్ని బయటకు పంపి మరమ్మతులు చేయాల్సి ఉంది. విభాగం ఉద్యోగులు అత్యంత ప్రతిభ కనబరిచి దానికి మరమ్మతులు పూర్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం యు.శ్రీధర్ చేతుల మీదుగా లోకోను ప్రారంభించారు. ఉక్కు ఉద్యోగులు సంస్థపై అదనపు భారం పడకుండా సొంతంగా మరమ్మతులు పూర్తిచేసి లక్షలాది రూపాయలు ఆదా చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.విజయకుమార్, డీజీఎంలు ఎస్.వి.ఎస్.రాజు, చక్రపాణితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

10 నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు



మహారాణిపేట: అక్రిడేటెడ్ జర్నలిస్టులకు శనివారం నుంచి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు. కేజీహెచ్ డౌన్ లోగల డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్ సెంటర్‌లో శనివారం ఉదయం 10 గంటలకు వైద్య పరీక్షలు, ఉచిత బీమా సదుపాయం (తెల్లకార్డు ఉన్న జర్నలిస్టులకు) కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం నుంచి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని, రోజు 30 మందికి చొప్పున వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

గోపాలపట్నం : ఈ నెల 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్, కళాశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరని ఉప రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం తెలిపారు. స్కూల్, కళాశాల బస్సు డ్రైవర్లకు కనీసం ఐదేళ్ల అనుభవంతో పాటు 60 ఏళ్లు మించకుండా ఉండాలని తెలిపారు. కంటి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గడువులోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని కళాశాల/స్కూల్ యాజమాన్యాలకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 915 స్కూలు బస్సులను ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు.

12 నుంచి ప్రత్యేక తనిఖీలు

స్కూల్/కళాశాల బస్సుల ఫిట్‌నెస్‌పై జూన్ 12 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని రాజారత్నం తెలిపారు. ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ బోర్డు

గోపాలపట్నం : హైసెక్యూరిటీ నంబర్ బోర్డు అమర్చిన తరువాతే వాహనాన్ని డీలర్ డెలివరి ఇవ్వాలని ఉప రవాణ కమిషనర్ రాజారత్నం తెలిపారు. సెక్షన్ 41(6) మోటార్ వాహనాల చట్టం 1988 ప్రకారం కొత్తవాహనాలు హై సెక్యూరిటీ బోర్డులు ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొన్నారు. హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకుండా ఏ కొత్త వాహనమైనా తిరిగితే వాహనదారుడుపై, డీలర్‌పై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జాతీయ సదస్సుకు వక్తగా డాక్టర్ ప్రకాష్‌కి ఆహ్వానం



దొండపర్తి: భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఒడిశా ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న 'జాతీయ ఖేల్ మహోత్సవ్'కు రిసోర్స్‌పర్సన్‌గా వ్యాయామ విద్యా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్‌ను గౌరవ అతిథిగా ఆహ్వానించారు. రెండు రోజుల పాటు కళింగ్ డీమ్డ్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయిలో సదస్సులో ప్రకాష్ తన పరిశోధనలపై ప్రసంగించనున్నారు. ఆయన 2006లో యూనివర్సిటీ విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ప్రభుత్వ వ్యాయమ ఉపాధ్యాయుల వర్కుషాప్‌లో కూడా రిసోర్స్ పర్సన్‌గా 'మారిన క్రీడల నిబంధనలు, మారుతున్న క్రీడల తీరుతెన్నుల'పై ప్రసంగించారు. ఇలా పలు జాతీయ సదస్సుల్లో పాల్గొన్న ప్రకాష్ 2003లో జరిగిన ఆఫ్రో ఏషియన్ గేమ్స్‌కి సమన్వయకర్తగా ఆంధ్ర నుంచి సేవలందించిన ఏకైక వ్యక్తిగా గుర్తింపుపొందారు. ఈ సందర్భంగానే ఆయన అందించిన సమాచారం జపనీస్, ఉర్దూ భాషల్లోకి తర్జుమా చేసుకున్నారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం దృష్ట్యా పలు రైళ్లు గురువారం కూడా రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఖరగ్‌పూర్ – విల్లుపురం (22603) ఎక్స్‌ప్రెస్, షాలిమార్ – హైదరాబాద్ (18045) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–మంగుళూరు (22851) వివేక్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–డిఘా (22874) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, డిఘా – విశాఖపట్నం (22873) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ – షాలిమార్ (12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు – హౌరా (22888) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ – షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. శుక్రవారం బయల్దేరాల్సిన హౌరా – మైసూరు (22817) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్ – హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి – చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్, పురూలియా – విల్లుపురం (22605) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. 11న బయల్దేరాల్సిన మైసూరు – హౌరా (22818) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు.

హజ్ యాత్రకు పయనం

అల్లిపురం: హజ్ యాత్రకు రెండు బస్సుల్లో యాత్రికులు గురువారం రాత్రి బయలుదేరివెళ్లారు. యాసిన్ హజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉత్తరాంధ్ర నుంచి 132 మంది యాత్రకు వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కొంత మంది విజయవాడ చేరుకోగా గురువారం రాత్రి 65 మంది హజ్ యాత్రికులు సీతంపేట నుంచి బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.

విదేశీ యువతిపై దాడి

పరారీలో నిందితుడు

ఆరిలోవ : జీవీఎంసీ ఆదర్శనగర్‌లో ఆరెంజ్ లాడ్జిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. థాయ్‌లాండ్ నుంచి ఈనెల 5న ఇద్దరు యువతులను మహేష్ అనే వ్యక్తి విశాఖ తీసుకొచ్చాడు. వారితో పాటు స్థానికంగా ఉంటున్న మరో మహిళను ఆదర్శనగర్‌లో ఆరెంజ్ లాడ్జిలో ఉంచాడు. వారి మధ్య ఏం జరిగిందో గానీ గురువారం థాయ్‌లాండ్‌కు చెందిన ఓ యువతిపై మహేష్ చేయి చేసుకున్నాడు. దీంతో ముగ్గురు మహిళలు నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విదేశీ మహిళలు కావడంతో సీపీ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని టాస్క్‌ఫోర్స్ పోలీసులను అలెర్ట్ చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సాయంత్రం ఈ లాడ్జిపై దాడి చేశారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకున్న మహేష్ ముందుగానే అక్కడ నుంచి పరారయ్యాడు. లాడ్జి నిర్వాహకుడి నుంచి వివరాలు సేకరించి ఫిర్యాదు చేసిన ముగ్గుర్ని కేజీహెచ్‌కు తరలించారు. పరారైన మహేష్ కోసం గాలిస్తున్నారు. కేసును ఆరిలోవ పోలీసులకు అప్పగించారు.

చెల్లని చెక్కు ఇచ్చిన మహిళలకు ఏడాది జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన మహిళకు ఏడా జైలు శిక్ష విధిస్తూ నగరంలోని నాల్గవ ప్రత్యేక మెజిస్ట్రేట్ గురువారం తీర్పు చెప్పారు. ఫిర్యాదు న్యాయవాది ఎడ్ల రాజారావు అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. నిందితురాలు పశ్చిమగోదావరి జిల్లా ఏఎస్‌వీఎస్ శ్యాంకృషియాన్ భార్య ఉషారాణి. ఆమె తన అవసరాల నిమిత్తం 2013లో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య శ్యాంబాబు నుంచి రూ.8 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్చే నిమిత్తం ఒక ప్రాంసరీ నోటు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శ్యాంబాబు తన బాకీ తీర్చాలని డిమాండ్ చేయడంతో ఉషారాణి 2017 ఆగస్టు ఏడో తేదీన ఒక చెక్కు జారీ చేశారు. పాక్షికంగా బాకీ తీర్చే నిమిత్తం రూ.8 లక్షలకు జారీ చేసిన చెక్కును ఫిర్యాది శ్యాంబాబు తన ఖాతాలో జమ చేశారు. తగినన్ని నిధులు లేని కారణంగా ఆ చెక్కు నిరాదరణకు గురైంది. ఫిర్యాది తన వారి ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసిన ప్రయోజనం లేకపోయింది. దీంతో శ్యాంబాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసు విచారణలో ఉండగా శ్యాంబాబు మృతి చెందారు. కేసు విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

నేడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాక

సాక్షి, విశాఖపట్నం: రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా శుక్రవారం విశాఖకు రానున్నారు. శుక్రవారం సాయంత్రం చినగదిలి వద్ద ఉన్న ఈవీఎం గోదాములను తనిఖీ చేస్తారు. అనంతరం స్థానిక అధికారులతో ఎన్నికలకు సంబంధించిన ముఖ్య అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం ముఖేష్ కుమార్ మీనా విజయవాడ తిరుగు ప్రయణమవుతారని అధికారులు వెల్లడించారు.

అంశాలన్నీ ఆమోదం

స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ హరివెంకట కుమారి


మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన గురువారం జరిగింది. అజెండాలో 22 అంశాలు, 2 టేబుల్ అంశాలు పొందుపరచగా అన్ని ఆమోదం పొందాయని చైర్‌పర్సన్ తెలిపారు. ప్రజారోగ్య విభాగానికి సంబంధించి జీ–20 సదస్సు బిల్లులు, 30 రోజుల్లో డోర్ టు డోర్ చెత్త వాహనం ఏర్పాటు, పారిశుద్ధ్య కార్మికులకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలకు ప్రీమియం చెల్లించేందుకు, విలీన పంచాయతీల్లోని సిబ్బంది కొనసాగింపు, చందనోత్సవంలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన తాత్కాలిక సిబ్బందికి చెల్లింపులు, 30 రోజులకు తాత్కాలికంగా పందుల నిర్మూలనకు కావల్సిన సిబ్బంది, వాహనం ఏర్పాటుకు సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే ఔట్‌సోర్సింగ్ సేవా రుసుం చెల్లింపునకు, ఐటీ విభాగం టెలికాన్ఫరెన్స్ నిర్వహణకు, ఉద్యోగుల సర్వీసుకు సంబంధించి 17, 18, 19 అంశాల్లో షరతులతో కూడిన అనుమతులు వంటివి వాటికి ఆమోదం లభించింది. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపుతో పాటు తదితర అంశాలు ఆమోదం పొందాయన్నారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల ప్రవేశాలకు దరఖాస్తులు

సింహాచలం : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వతరగతి వరకు ఉన్న ఖాళీల భర్తీకి అర్హులైన బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, సింహాచలంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.సత్యారావు గురువారం తెలిపారు. విశాఖ జిల్లాలో ఉన్న సింహాచలం, పెదనరవ బాలుర గురుకుల పాఠశాలలు, అన్నవరంలోని బాలికల పాఠశాల, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం బాలరు పాఠశాలలు, తానాం, చోడవరం, పాయకరావుపేటలో ఉన్న బాలికల పాఠశాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి 14వతేదీ వరకు ఆయా పాఠశాలల్లోనే దరఖాస్తులు ఇవ్వనున్నటు చెప్పారు. తెలుగు, గణితం, సైన్సు, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు సంబంధించి ఆబ్జెక్టివ్ ప్రశ్నల తరహాలో 50 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. 17వ తేదీన సింహాచలంలోని గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

కార్మికులంతా శాశ్వత ఉద్యోగులే..

- తొలగించిన కార్మికుల్ని తిరిగి నియమించాలి
- కలెక్టర్ ఆధ్వర్యంలో గంగవరం పోర్టు చర్చలు సఫలం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.మల్లికార్జున, గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం : గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరూ సహకరించాలని కలెక్టర్ డా.ఎ మల్లికార్జున కోరారు. ఆయన అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, గంగవరం పోర్టు కార్మికులు, కార్మిక సంఘాలు, పోర్టు యాజమాన్యంతో గురువారం జరిగిన చర్చలు విజయవంతం అయ్యాయి. ఈ సందర్భంగా కార్మికులు, కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై పోర్టు యాజమాన్య ప్రతినిధుల నుంచి వివరణ తీసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులంతా శాశ్వత ఉద్యోగులేనని, గంగవరం పోర్టు లిమిటెడ్, గంగవరం పోర్టు సర్వీసెస్ ఉద్యోగుల్ని ఒకే విధంగా పరిగణిస్తామన్నారు. కార్మికులకు అందిస్తున్న ప్రత్యేక అలవెన్స్ రెట్టింపు చేయాలని, కార్మికుల విద్యార్హతలను పరిగణనలోనికి తీసుకొని సాంకేతిక విద్యార్హతలు గల కార్మికులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి వారికి అదనంగా రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని పోర్టు యాజమాన్యానికి కలెక్టర్ తెలిపారు. తొలగించిన కార్మికుల నుంచి వివరణ తీసుకొని తిరిగి నియామకం చేయాలని సూచించారు. బేసిక్ పే పెంపు అంశం ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని, దాని గురించి ప్రభుత్వానికి లేఖ రాస్తామని వివరించారు. కార్మికులకు మెరుగైన వైద్య సౌకర్యాల్ని ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లోనే కాకుండా, ఇతర ఆసుపత్రుల్లోనూ చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా పోర్టు యాజమాన్యానికి తెలిపినట్లు వెల్లడించారు. పోర్టు యాజమాన్యం సామాజిక బాధ్యతగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచుటకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ అనంతరం వచ్చే గ్రాట్యూటీ వీలైనంత ఎక్కువ అందించేందుకు గల అవకాశాల్ని పరిశీలించాలన్నారు. కార్మికులకు రుణాలు మంజూరు విషయమై బ్యాంకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పోర్టు యాజమాన్యం కార్మిక సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలపై తీసుకున్న చర్యలపై వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేయాలని కార్మిక సంఘాలకు కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గంగవరం పోర్టు లిమిటెడ్, గంగవరం పోర్టు సర్వీసెస్ ఉద్యోగులను ఒకే విధంగా పరిగణించాలన్నారు. కార్మికుల తరఫున నొల్లి తాతారావు, మాత అప్పారావు మాట్లాడుతూ కనీస వేతనం అమలు, బేసిక్ పే పెంపు, జీపీఎస్, గ్రాట్యూటీ, డస్ట్ అలవెన్స్, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, కార్మికులకు వైద్య సదుపాయం తదితర సమస్యల్ని ప్రస్తావించారు. కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు నిలుపుదల చేయాలని, పునరావాస ప్యాకేజీలో నియమితులైన ఉద్యోగులు శాశ్వతమా, తాత్కాలికమా వివరణ కావాలని డిమాండ్ చేశారు. ఈ చర్చల్లో పోర్టు ఈడీ జీజే రావు, సీనియర్ అడ్వైజర్ సాంబశివరావు, సీఈవో గాంధీ, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీఎం డీపీసీ సీహెచ్ గణపతి, లేబర్ డిప్యూటీ కమిషనర్ సునీత, డీసీపీ ఆనంద్‌రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అయ్యవార్లు అడ్డదారులు..!

- బదిలీల్లో ఇష్టారాజ్యం
- 106 మందికి మెమోలు జారీ
- జాబితాల పరిశీలనలో అధికారుల అలసత్వం
- డీఈవో కార్యాలయంలో ఓ యూనియన్ గుత్తాధిపత్యం
- ఖాళీలు చూపించటంలో అధికారుల నిర్లక్ష్యం
- ఫిజికల్ డైరెక్టర్లకు తీవ్ర నష్టం

విశాఖ విద్య : ఆనందపురం మండలం ఎంపీయూపీఎస్ వెంకటాపురంలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ పోస్టును రేషనలైజేషన్‌లో చూపించారు. అక్కడ పని చేసే ఉపాధ్యాయుడు బదిలీల్లో తప్పనిసరిగా మరోచోటకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ పోస్టు రేషనలైజేషన్‌కు గురికాలేదనే తప్పుడు సమాచారం నమోదు చేశారు. ఆ ఉపాధ్యాయుడికి తెలిసో, తెలియకో ఇలా చేసినా, పర్యవేక్షణాధికారిగా ఉన్న ఎంఈవో దీన్ని సరిదిద్దాలి. అధికారులు చేసిన తప్పిదాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులు గుర్తించి, ఎందుకిలా జరిగిందో సంజాయిషీ ఇవ్వాలని సదరు ఎంఈవోకు మెమో జారీ చేశారు.

సబ్బవరం మండల కేంద్రంలోని హైస్కూల్‌లోని ఓ ఉపాధ్యాయురాలు ఎనిమిదేళ్ల సర్వీసు నిండకున్నా, దరఖాస్తులో మాత్రం 'ఎస్' గుర్తించటంతో అక్కడి పోస్టు ఖాళీగా ఉన్నట్లు జాబితాలోకి చేరింది. దీంతో అనివార్యంగా సదరు ఉపాధ్యాయురాలు గాల్లో ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎంఈవో సరైన పరిశీలన చేయకపోవటంతోనే ఈ సమస్యకు కారణంగా గుర్తించిన ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలా 106 మంది ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన బదిలీ దరఖాస్తులో దొర్లిన తప్పిదాలను ఉన్నతాధికారులు గుర్తించారు. పూర్తి స్థాయిలో అవగాహన లేకనే చాలా మంది ఉపాధ్యాయులు ఇలా చేశారని చెబుతున్నా, పర్యవేక్షణాధికారులుగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో, డిప్యూటీ డీఈవోలు తగిన రీతిలో పరిశీలన చేయలేదనేది దీని ద్వారా తేటతెల్లమైంది. జరిగిన తప్పిదంతో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి కాకున్నా, ఆ చోటు వెబ్‌సైట్‌లో ఖాళీల జాబితాల్లో కనిపించటం వల్ల వేరే ఉపాధ్యాయులు కోరుకున్నారు. ఫలితంగా ఒకే చోట ఇద్దరేసి ఉపాధ్యాయులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నగరంలోని రైల్వే కాలనీ స్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య తలెత్తిన ఇటువంటి వివాదం విద్యాశాఖాధికారుల మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది. దీన్ని సరిదిద్దేందుకు విద్యాశాఖాధికారులు రంగంలోకి దిగారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 106 మంది ఉపాధ్యాయులు, వారి పర్యవేక్షణాధికారులకు మెమోలు జారీ కావటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వారి నిర్లక్ష్యం.. పీడీలకు శాపం

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న బదిలీల ప్రక్రియకు విశాఖపట్నం డీఈవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా... కార్యాలయంలోని ఓ అధికారి నిర్వాకం, సిబ్బంది అలసత్వం కారణంగా ఫిజికల్ డైరెక్టర్‌లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉపాధ్యాయులు అంటున్నారు.


విశాఖ జిల్లాలో 54 వరకు పీడీ పోస్టులు ఉండగా, 21 మాత్రమే ఖాళీలను వెబ్‌సైట్‌లో ఉంచటం వల్ల, అనివార్యంగా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీపై వెళ్లాల్సి వస్తోందని పలువురు ఫిజికల్ డైరెక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే ఓ ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈవో కార్యాలయంలోనే తిష్ట వేసి, గుత్తాధిపత్యం చేస్తుండంతోనే తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయని ఉపాధ్యాయులు బాహాటంగానే అంటున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు మిగతా ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమౌతున్నట్లు తెలుస్తోంది.


చోడవరం బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధుల్లో చేరిన రామిరెడ్డి

బదిలీ ఉత్తర్వులు విడుదల

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. 146 మంది గ్రేడ్–2 హెచ్ఎంల బదిలీల ఉత్తర్వులు బుధవారం సాయంత్రం విడుదల కాగా, వీరంతా గురువారం రిలీవ్ అయి, బదిలీ అయిన స్కూళ్లలో విధుల్లో చేరారు. స్కూల్ అసిస్టెంట్‌లకు శుక్రవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో ఉత్తర్వులు జారీ కానున్నాయి. దీంతో ఉపాధ్యాయుల్లో సందడి వాతావరణం నెలకొంది.

అందరికీ ఆమోదకరమైన రీతిలో బదిలీలు



ఉపాధ్యాయులందరికీ ఆమోదకరమైన రీతిలో బదిలీలు జరుగుతున్నాయి. ఏదైనా తప్పిదాలు జరిగితే, పర్యవేక్షణాధికారుల నుంచి వివరణ కోరి, తదుపరి చర్యలు తీసుకుంటాం. ఆప్షన్స్ నమోదులో తలెత్తిన సాంకేతిక సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.
– ఎం.జ్యోతికుమారి, బదిలీల ప్రత్యేకాధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

వనరులు వినియోగించుకోవాలి

సబ్బవరం: సబ్బవరంలోని ఇండియన్ మారీటైం యూనివర్సిటీ (ఐఎంయూ) క్యాంపస్‌తో పాటు విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారీటైం అండ్ షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్)లను విశాఖ పోర్టు అథారిటీ చైర్ పర్సన్ డాక్టర్ ఎం అంగముత్తు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సెమ్స్, ఐఎంయూ ఫ్యాకల్టీ, విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు.అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకోని సంస్థలను అభివృద్ధి చేసేందుకు సలహాలు, సూచనలు చేశారు. బుక్స్, జర్నల్స్‌తో కూడిన లైబ్రరీ ఏర్పాటుకు వీపీఏ సహకరిస్తుందన్నారు.

సహకార సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి

గోపాలపట్నం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ చింతకాయల అనిత అన్నారు. మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో మహాజన సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర స్థాయిలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కమిటీ ద్వారా సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి రూ .1.48 కోట్ల లాభాన్ని ఆర్జించామని తెలిపారు. బ్యాంక్ ఆర్జించిన లాభం నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల షేరు ధనంపై 6 శాతం వడ్డీ అందజేస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డీవీఎస్ వర్మ, ఆప్కాబ్ డీజీఎం పీబీ ప్రత్యూష, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యుయలరీ షోరూం ప్రారంభం

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): గోపాలపట్నంలో సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యుయలరీ షోరూంను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం ప్రారంభించారు. మంత్రి అమర్‌నాథ్‌కు సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ ఘనంగా స్వాగతం పలికారు. సిల్వర్ విభాగాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, షోరూం మొదటి అంతస్తులో వెడ్డింగ్ జ్యూయలరీ విభాగాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గోపాలపట్నంతో పాటు పరిసర ప్రాంతాలవారికి ఇక్కడేర్పాటు చేసిన సీఎంఆర్ నగల షోరూం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ గోపాలపట్నంలో అతిపెద్ద బంగారు ఆభరణాల షోరూం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా గ్రాము బంగారంపై రూ.200వరకు క్యాష్ బ్యాక్, ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజి మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచి తగ్గట్టుగా ప్రాచీన మోడల్ నగల నుంచి ఆధునిక జ్యుయలరీ వరకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గణబాబులను సీఎంఆర్ డైరెక్టర్ మావూరి హేమహారిక సత్కరించి జ్ఞాపికలను అందించారు.



సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యుయలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

రైలు ప్రమాద మృతులకు ఘన నివాళి

తాటిచెట్లపాలెం : ఒడిశాలో రైలు ప్రమాద మృతులకు వాల్తేర్ డివిజన్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి నివాళులు అర్పించారు. డీఆర్‌ఎం కార్యాలయం వద్ద గురువారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.